# అనుబంధాలు

-శారదా అశోకవర్ధన్

'ఒరేయ్ వీనూ! ఎందుకురా ఇలా చేసావ్? ఎవరినైనా ప్రేమించి చెప్పడానికి భయపడి ఏ గుళ్లోనో పెళ్లి చేసుకుని పారిపోయావా? ఏదైనా ఫ్రాడ్‌లో ఇరుక్కున్నావా? ఎందుకని ప్రాణానికి ప్రాణంగా చూసుకుంటున్న బామ్మని ఒక్కసారిగా చీకట్లోకి తోసేసి వెళ్లిపోయావు? నువ్వు రానిదే పచ్చి మంచినీళ్లయినా ముట్టని బామ్మని వదిలేసి ఎటో వెళ్లిపోవడానికి నీకు మనసెలా వచ్చిందిరా? వీనూ! నువ్వలా వెళ్లిపోతే ఆమె బతుకుతుందనే అనుకున్నావా? బ్యాంక్‌లోంచి డబ్బు డ్రా చేసి ఎవ్వరికీ చెప్పకుండా చివరికి నాతో కూడా ఒక్క మాటయినా చెప్పకుండా అలా వెళ్లిపోతే బామ్మ బతుకుతుందనుకున్నావా? బామ్మ లేని నేను, నువ్వు లేక ఎలా ఉండగలననుకున్నావు? నీలోనూ ఏ మూలో స్వార్థం బంధాలనీ, అనురాగాలనీ, ఆప్యాయతలనీ తుంచేసిందా? బామ్మ పెంపకంలో నువ్వు నేర్చుకున్నది ఇదేనా? అవున్లే బామ్మ కొడుకుల్లోనే ఒకరైన బాబాయి బామ్మని నాన్నకు వదిలేసి పిన్ని కొంగుచ్చుకుని ఇల్లరికం వెళ్లిపోలేదూ?' కళ్లంట నీళ్లు జలజలా కారుతున్నా అలా శిలావిగ్రహంలాగానే కూర్చుంది దమయంతి.

ఆమె మౌనాన్ని భంగం చేయడానికి భయపడి పక్క గదిలోంచి ఆమెని కనిపెడుతూనే వుంది నరసమ్మ.

అంతలో ఫోన్ రింగయింది. యాంత్రికంగా లేచి రిసీవర్ తీసింది దమయంతి.

"బామ్మకెలా వుందమ్మా?"

"అలాగే వుంది డాక్టర్. మీరిచ్చిన మందులన్నీ వేసాను. చలనం లేదు" మనోవ్యాధికి మందేముంది? అనాలనుకుంది. మాటలు గొంతు దాటలేదు.

"అవసరం అయితే సంకోచించక ఏ టైమయినా ఫోన్ చేయమ్మా వస్తాను. మూడుగంటల తరువాత మళ్లీ అవే మాత్రలివ్వు" ఫోన్ పెట్టేసారు డాక్టర్ బాలాజీ.

లోకమంతా ఒక్కసారిగా చీకటైనట్లయింది దమయంతికి.

బామ్మ తనకి అమ్మ, నాన్న, దేవత అన్నీనూ. తమ్ముడు వినోద్‌నీ, తననీ రెండు కళ్లల్లా చూసుకునేది.

అమ్మా నాన్నా ఇద్దరూ తిరుపతికి వెళ్లివస్తూ కారు యాక్సిడెంట్‌లో చనిపోయారు. తనూ, వినోద్ చిన్న చిన్న గాయాలతో బతికి బయటపడ్డారు.

ఆనాటి నుండి పుట్టెడు దుఃఖాన్ని కడుపులో పెట్టుకుని తనకీ, వీనూకీ ఏ ఇబ్బంది కలగకుండా అమ్మనీ, నాన్ననీ మరిపించేలా పెంచింది.

గోరుముద్దలు తినిపించేది కొసరి కొసరి వడ్డిస్తూ. ప్రతి పండుగకూ కొత్త బట్టలు కొనేది. తనకీ, వినోద్‌కీ ఇష్టమైన పిండివంటలు చేసి పెట్టేది.

బామ్మ మంచి మాటకారి. ఎవ్వరినీ నొప్పించకుండా మాట్లాడే నేర్పరి. చాదస్తం ఏ మూలా లేకుండా ఆధునిక భావాలని హర్షించే తెలివైన వ్యక్తి.

అమ్మ నగలూ నట్రా నాకోసం కొన్ని, వినోద్‌కి పెళ్లయితే ఆ వొచ్చే అమ్మాయికి కొన్ని అని దాచింది.

అంత వివేకం, దూరదృష్టి బామ్మది. అటువంటి బామ్మని పెళ్లాం మాటలు విని నానా మాటలూ అన్నాడు బాబాయి. నాన్నా, అమ్మా బామ్మని సపోర్టు చేసారని వాళ్లతోనూ తెగతెంపులు చేసుకున్నాడు.

వినోద్ తన స్వార్థం కోసం బ్యాంకులో డబ్బు డ్రా చేసేసి చెప్పా పెట్టకుండా అమెరికా వెళ్లిపోయాడని తెలిసి బామ్మ తట్టుకోలేకపోయింది. గుండె ఆ దుఃఖాన్ని మోయలేకపోయిందేమో అటాక్ వచ్చింది.

పదిహేనురోజులు ఆసుపత్రిలో వుండి నాలుగురోజుల క్రితమే డిశ్చార్జ్ అయి ఇంటికొచ్చింది. ఫ్యామిలీ డాక్టర్ బాలాజీ వచ్చి చూసి పోతున్నాడు.

ఆ ఇంటినీ, బామ్మనీ పాతికేళ్లుగా కనిపెట్టుకుంది నరసమ్మ.

బామ్మ ఇల్లు నరసమ్మకి దేవాలయం. నరసమ్మ దాని మొగుడు వీరయ్య బామ్మకి నమ్మిన బంట్లు, ఆత్మీయులు.

బామ్మ మంచం పట్టినప్పటి నుంచీ నరసమ్మ, వీరయ్య అహోరాత్రులు తిండీ నిద్రా మాని కంటికి రెప్పలా చూసుకున్నారు. అది ఏ బంధమో చెప్పలేనిది. ఆ చాకిరీ వెలకట్టలేనిది. బామ్మ మంచం పట్టడం, వినోద్ లేకపోవడం తనకి పిచ్చిపట్టినట్లయింది. మౌనం మనసు నిండా అలుముకుంది.

"అమ్మా! కొంచెం ఎంగిలిపడమ్మా" అంది

నర్సమ్మ.

"వద్దు నర్సమ్మా... ఆకలిగాలేదు. కొంచెం మజ్జిగివ్వు చాలు" అంది దమయంతి ఏదో పుస్తకాన్ని పట్టుకుని పేజీలు తిరగేస్తూ.

"అసలే నీరసంగా వున్నావు చిన్నమ్మా... కొంచెం ఆవకాయన్నం కలుపుకుని తిను. ప్లేట్లో పెట్టిస్తా" అంది.


అది అన్నీ బామ్మలాగే చేస్తుంది. బామ్మ చేతి కింద మెదిలీ ఆమె అలవాట్లన్నీ నేర్చుకుంది. అంతరాల భేదం లేకపోతే అది బామ్మకి బిడ్డలాంటిది. బామ్మని పెద్దమ్మా, తనని చిన్నమ్మా అని పిలుస్తూంది ప్రేమగా.

"వద్దు నర్సమ్మా మజ్జిగ చాలు" అని అంటున్నా వినకుండా వెళ్లి మెత్తగా మజ్జిగన్నం, ఆవకాయ ముక్కేసి ప్లేటుని చేతికిందిచింది. ఇక లాభంలేదని గబగబా తిని తన గదిలోకి వెళ్లి మంచంమీద వాలింది.

కడుపులోని మజ్జిగన్నం చల్లదనం వల్లనేమో వెంటనే మత్తుగా నిద్ర ముంచుకొచ్చింది తనకి తెలీకుండానే. బామ్మ మంచానికి దగ్గరగా జంబుకానా వేసుకుని పడుకుంది నర్సమ్మ.

సడెన్‌గా బామ్మ మూలుగు పెద్దగా వినిపించింది.

"చిన్నమ్మగోరూ త్వరగా రండి" అంటూ నర్సమ్మ అరుపు విని గబుక్కున మంచం దిగి బామ్మ మంచం దగ్గరకెళ్లింది. బామ్మ మెడ పక్కకి వాలిపోయి ఉంది.



“బామ్మా...బామ్మా...లే బామ్మా నేను దమయంతిని. నువ్వు లేకపోతే నేను బతకలేను బామ్మా. నీకు తెలుసుకదా ఎందుకు వెళ్లిపోయావు?” అని గట్టిగా ఏడవాలనుకుంది. కానీ దుఃఖం గొంతు దాటలేదు. అలా కొయ్యబారిపోయినట్లు నుంచుంది.

నర్సమ్మ ఏడుస్తూనే వెళ్లి అవుట్‌హౌస్‌లో వున్న వీరయ్యను పిలిచింది.

వీరయ్య వచ్చి చూసి “అమ్మా! డాక్టర్‌గారికి ఫోన్ చేయమ్మా’ అన్నాడు.

యాంత్రికంగా వెళ్లి ఫోన్ చేసింది. మాట రావడంలేదు. “డాక్టర్..బామ్మ...బామ్మ” అంటూ ఏడ్చేసింది.

పరిస్థితిని అర్థం చేసుకున్న డాక్టర్ “నేను వస్తున్నాను” అని ఫోన్ పెట్టేసాడు.

పక్కసందులోనే కనుక పది నిముషాల్లో వచ్చేసారు డాక్టర్‌గారు.

దమయంతి భుజం చుట్టూ చేయివేసి “ఐయామ్ సారీ” అన్నారు.

అతడ్ని పట్టుకుని బిగ్గరగా ఏడవాలనిపించింది. గొంతు పెగలడంలేదు.

ఇరుగుపొరుగులకు చెప్పేసింది నర్సమ్మ. వీరయ్య, వినోద్ ఫ్రెండ్ కాశ్యప్ ఇంటికి వెళ్లాడు. కాసేపట్లో కాశ్యప్, మరో ఇద్దరు స్నేహితులు రాణా, వెంకట్‌లను వెంటబెట్టుకొచ్చాడు.

“అక్కా” అంటూ దమయంతి దగ్గరకు వచ్చారు.

“వీనూ! వచ్చావా? బామ్మ ఋణం తీర్చుకోవాలని వచ్చావా? అసలు బామ్మ ప్రాణాలు పోయింది నీవల్ల కదూ? చెప్పు... ఎందుకిలా చేసావ్?”

“అక్కా...నేనక్కా కాశ్యప్‌ని” దమయంతి భుజాలు పట్టుకుని ఊపుతూ అన్నాడు.

“ఊ”

“అక్కా! వీనూ బాగానే వున్నాట్ట. రాత్రి రెండు గంటలకు నాకు ఫోన్ చేసాడు. తెల్లరగానే వచ్చి నీకే వార్త చెబుదామనుకున్నాను. వాడికి వాషింగ్టన్‌లో ఉద్యోగం వచ్చిందిట. మేరియే వాడి ఉద్యోగం కోసం ట్రై చేసిందిట. నీకు ఇవ్వాళ ఫోన్ చేస్తానన్నాడు. బామ్మకీ, నీకూ చెప్పకుండా అమెరికా వెళ్లిపోయినందుకు బాధ పడుతున్నాననీ, తెలిస్తే మీరిద్దరూ వెళ్లనివ్వరనీ అలా చేసాట్ట. త్వరలోనే వచ్చి మీకు అన్ని విషయాలూ చెప్పి క్షమాపణ కోరుతానని చెప్పాడు. వాడికి బాగా అమెరికా పిచ్చి కదా. ఉద్యోగం వచ్చాక నిన్నూ, బామ్మనీ కూడా అక్కడికి తీసుకెళ్లి బామ్మని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలని వాడి ఆశ. కానీ అంతలోనే...”

“స్టాపిట్” అరిచింది దమయంతి.

ఉలిక్కిపడ్డట్టు చెప్పడం ఆపేసాడు కాశ్యప్.

అంతలో దమయంతి క్లాస్‌మేట్స్ ఉమా, హైమావతి, ఝాన్సీ వచ్చారు “బామ్మ ఎప్పుడు పోయిందే? ఎలా?” అనుకుంటూ.

‘తన రక్తాన్ని ధారపోసి ఎంబీయే వరకూ, వీనూని ఇంజనీరింగ్ వరకు చదివించింది బామ్మ. మా పెళ్లిళ్లు చేసి చూసి మురిసిపోవాలనుకుంది. కానీ ఆమె ఆశలను చంపేసాడు వీనూ’ అని చెప్పాలనుకుంది. మాటలన్నీ ఘనీభవించిపోయి గొంతు దాటి రావడంలేదు.

ఎవరెవరో చుట్టాలు, స్నేహితులతో ఇరుగుపొరుగులతో ఇల్లు నిండిపోయింది.

ఎవరికి తోచినది వాళ్లు మాట్లాడుకుంటున్నారు. అందరికీ అడిగినవారికి అడిగినట్లు సమాధానం చెబుతోంది నరసమ్మ.

“మీ బాబాయికి ఫోన్ చేసావా?” అడిగారెవరో.


ఎక్కడికి చేయాలి? ఏమని చెప్పాలి? ఎప్పుడో చిన్నప్పుడు చూసిన బాబాయి గుర్తు. తననీ, వినోద్‌నీ చేరదీసి మాకోసం మా చదువులకోసం తన ఇల్లూ, ఊళ్లో వున్న పొలం అమ్మేసిందన్న కోపంతో బాబాయి బామ్మని చూసే ఎన్నో ఏళ్లయింది. వాళ్ల ఫోన్ నెంబర్‌గానీ, అడ్రస్‌గానీ తెలీదు. ఏం చేయాలో తోచలేదు దమయంతికి.

“నాకు తెలుసు. విస్సిగాడి అడ్రస్ నా దగ్గరుంది” అన్నాడు వాళ్లల్లో ఒకాయన.


ఆయన బామ్మకి వేలు విడిచిన తమ్ముడవుతాడు. ఇక్కడే వనస్థలిపు

# పరగడుపు వ్యాయామం శ్రేష్ఠం

ఆరోగ్యమే సౌభాగ్యమన్నారు పెద్దలు. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల ఆహారంతోపాటు శారీరక వ్యాయామం కూడా అవసరమే. నాగరిక జీవనం, ఆధునిక సౌకర్యాలు శారీరక శ్రమ లేకుండా చేస్తున్నాయి. అయితే వ్యాయామం చేసే ముందు, స్పోర్ట్స్ శిక్షణ తీసుకునే ముందు ఏమైనా తినాలా? లేదా ఏమీ తినకుండానే స్పోర్ట్స్ శిక్షణ, వ్యాయామం చేయవచ్చా? పురుషులకు మాత్రం పరగడుపు స్పోర్ట్స్ శిక్షణ, వ్యాయామం మంచిదని పురుష క్రీడాకారులపై మాసే విశ్వవిద్యాలయంలో జరిగిన అధ్యయనం చెబుతోంది. ఈ విశ్వవిద్యాలయ ఆచార్యులు రెండు సైకిలిస్ట్ బృందాలపై అధ్యయనం చేసారు. స్పోర్ట్స్ శిక్షణకు ముందు వీరిలో ఒక బృందానికి ఎక్కువ కాలరీల కార్బోహైడ్రేట్స్ ఉన్న బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వగా, మరో బృందానికి ఉదయాన్నే పరగడుపున స్పోర్ట్స్ శిక్షణ ఇచ్చారు. ప్రతి బృందం 75 నిముషాలవరకు సైక్లింగ్ చేసారు. శిక్షణకు ముందు ఆ తరువాత వీరి కాళ్ల నుండి రక్తం నమూనాలను, కండరాల బయాప్సీ పరీక్షలు చేసారు. ఫలితాలు పరిశీలించగా వీరిలో శిక్షణకు ముందు బ్రేక్‌ఫాస్ట్ చేసిన బృంద సభ్యులకన్నా పరగడుపున శిక్షణ తీసుకున్న బృంద సభ్యుల కండరాల్లో ఎక్కువ గ్లైకోజన్ నిలువ చేసుకోగలిగినట్లు తెలిసింది.



-డా.నమ్మోట



రంలో వుంటార్ట. బామ్మ అంటే పెద్ద ప్రేమలేదు. నాన్న అన్నా అంతంతే. కానీ బాబాయి అంటే ప్రేమ. నాన్నగారి పేరు నాగేశ్వరరావు, బాబాయి పేరు విశ్వేశ్వరరావు.

ఫోన్ నెంబర్ తిప్పాడు.

అవతల బాబాయ్‌లా వుంది. ఏదో మాట్లాడాడు.

ఫోన్ దమయంతికి ఇచ్చి మాట్లాడమన్నాడు. అసలే నోరు పెగలడం లేదు. అన్నేళ్ల తరువాత బంధమా, బంధుత్వమా? విచిత్ర సంబంధం? ఫోన్ అందుకుంది.

"బామ్మ పోయిందిటగా. పాపం... అమ్మని మొన్ననే తల్చుకున్నాను. ఓసారి వద్దామనుకున్నాను. మా హేమూ ... అదే మా అమ్మాయి హేమ మాలినికి పెళ్లి కుదిరింది. అబ్బాయి డాక్టర్. శ్రావణమాసంలో పెళ్లి. ఈ విషయం చెప్పడానికి వద్దామనుకున్నాను. రాకుండానే పోయింది. ఇవాళ మా రెవిన్యూ వాళ్ల మీటింగ్ వుంది కలెక్టర్ ఆఫీసులో. రేపు బయల్దేరి వచ్చేస్తా. పాపం చిన్న పిల్లలు. శవాన్ని అట్టేబెట్టడం కష్టం. ఆ ఫార్మాలిటీస్ తమ్ముడి చేత చేయించేయి. చెట్టంత అమ్మే పోయాక ఇవన్నీ ఏముందిలే? ఎలా చేసినా ఆమెకేం తెలుస్తుంది? అంతా మన తృప్తికోసం" అన్నాడు.

"ఊ...ఆ..." తప్ప ఏమీ అనలేకపోయింది దమయంతి. మనసు మరింత మొద్దుబారిపోయింది.

"ఊ...సరే మరేం చేద్దాం,. మన బ్రాహ్మడికి చెప్పి ఎవర్నైనా తెచ్చి కార్యక్రమం చేయించేద్దాం" అన్నాడు బామ్మ వేలు విడిచిన తమ్ముడు.

"బామ్మ...బంగారంలాంటి బామ్మ. ప్రేమ తప్ప ఎరుగని బామ్మ. ఆ దయామయికి ఎవరో వచ్చి ఏదో చేయాలా? అసలు అయినవాళ్లంటే అర్థం ఏమిటి? దేనికయినవాళ్లు? అన్ని మర్యాదలు అందుకునేవాళ్లా? చుట్టరికాన్ని చుట్టుకుని సర్వహక్కులు పొందినవాళ్లా? మనసును కనిపెట్టి కష్టసుఖాలు పంచుకునేవాళ్లా?" అడుగుదామనుకుంది.

పిన్ను కింద పడితే చప్పుడయ్యేంత నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దం గుండెని చీల్చేస్తోంది. నరసమ్మ దమయంతి దగ్గరకొచ్చింది.

"చిన్నమ్మా! నువ్వేమీ అనుకోకపోతే ముక్కూ మొహం తెలీని ఆళ్లేదో పెద్దమ్మగారికి నిప్పెడ్తే ఆమె మనసు శాంతిస్తుందా?" అంది.

"బామ్మ కర్మకాండ నేను చేస్తాను" అంటూ బాత్రూంలోకి వెళ్లి తల స్నానం చేసి తడి బట్టలతో వచ్చి నిల్చుంది దమయంతి.

అందరూ ఆమెను వింతగా చూసారు. నిశ్శబ్దం ఇంకా ఎక్కువైంది.

నీరసం, దుఃఖం, బాధ కుమిలిపోతూ కళ్లు తిరిగి పడబోయింది దమయంతి.

కాశ్యప్, వెంకట్‌లు "అక్కా" అంటూ పడిపోకుండా పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టారు.

తడి బట్టలతో ప్రత్యక్షమయ్యాడు వీరయ్య.

"అమ్మ మాయమ్మ. మనసున్న మహాతల్లి. ఆమె చేతుల్తో మాకు వండి మాకు పెట్టిన బువ్వ మాలో రక్తంగా మారి ఆమె బుద్ధులను మాకందించి జీవితాన్ని ప్రసాదించింది. ఆమె ఋణం తీర్చుకోవడానికి నాకిదొక్కటే మార్గం. కాదనకండి బాబూ. అమ్మకి నేను కొడుకులాంటోణ్ణి. మీ ఇంట్లో పుట్టకున్నా మీ మెతుకులతో ఎదిగాను. మీరు తినే ఆవకాయ, పప్పన్నం తప్ప నేను మా నర్సీ మా వంటలు ముట్టలేదు. 'వీరిగా' అని ఆప్యాయంగా పిలిచే అమ్మకి నేను చేసే ఈ పని నచ్చుతుందయ్యా. కాదనకండి" అంటూ బామ్మ చుట్టు తిరిగి ప్రదక్షిణం చేసి కుండ చేత్తో పట్టుకున్న వీరయ్యను చూసి పెదవులు చిన్నగా విచ్చుకున్నాయి.

'బ్లడ్ రిలేషన్స్' అంటే సేమ్ గ్రూప్, బ్లడ్డా? అందరికీ ఆ గ్రూపులున్నాయిగా? ఒక ఇంట్లో పుట్టడమా? కాదు ...కాదు కానేకాదు. కలసిన మనసులు. ఆత్మీయతలు, అనుబంధాలు' గట్టిగా చెప్పాలని నోరు తెరిచినా స్వరం రాక పలకక అలా ఉండిపోయింది దమయంతి.

కన్నీళ్లు చెంపలమీదుగా చేరి గుండెని తడిపేస్తున్నాయి. ఎవరికి ఎవరు సొంతము? ఎంతవరకీ బంధము?

★



## గ్లామర్‌గా ఉండాలంటే...!

హీరోయిన్లు గ్లామర్‌గా ఉండాలంటే వెరైటీ కాస్ట్యూమ్స్ ధరించాలి, చక్కగా మేకప్ వేసుకోవాలి, బికినీలు వేసుకుంటే మరింత అందంగా ఉంటారు... ఇలా రకరకాలుగా కామెంట్స్ చేస్తుంటారు. 'గ్లామర్‌గా కనబడాలంటే విధిగా మేకప్ వేసుకోవాలని, మోడ్రన్‌గా ఉండాలనే కామెంట్స్‌తో నేను ఏకీభవించను. వివిధ భాషల్లో నేను గ్లామర్ పాత్రలు పోషించాను. కానీ ఏ చిత్రంలోనూ అసభ్యంగా కనిపించలేదు. చీర ధరించి కూడా ఎంతో గ్లామర్‌గా కనిపించవచ్చు... సో.. బికినీ ధరించినంత మాత్రాన గ్లామర్‌గా కనిపిస్తారనుకోవడం చాలా పొరపాటు' అంటోంది జెనీలియా. ఆమె అభిప్రాయంతో మనమూ ఏకీభవిద్దామా?

